క్లుప్తంగా

నవోదయ పరీక్ష ఫలితాల విడుదల

పెద్దాపురం: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి రెండో విడత నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదలైనట్టు ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఏప్రిల్ 29వ తేదీన నిర్వహించిన రెండో విడత ప్రవేశ పరీక్షలకు 8779 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా ఖాళీగా ఉన్న 20 సీట్లను భర్తీ చేశామన్నారు. వారిలో ఈ1015426, ఈ1016485, ఈ1016746, ఈ1019709, సీ1016040, ఐ1015020, జె1015400, ఐ1017814, ఎన్1018910, ఎన్1019560, ఎన్1019805, ఎన్1020627, జే1021426, ఐ1021507, జే1014447, జే1016495, ఓ1020633, ఓ1021350,పీ1014789, ఎల్1021713, హాల్ టిక్కెట్ నెంబర్లు గల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. వారు నవోదయ విద్యాలయానికి వచ్చి అడ్మిషన్ ఫాంలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మేడపాడు విద్యార్థిని


జానా అస్మితను అభినందిస్తున్న పీడీ

సామర్లకోట: ఈనెల 25, 26 తేదీల్లో ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీలు అనపర్తిలో నిర్వహించగా నియోజకవర్గం నుంచి మేడపాడు విద్యార్థిని జానా అస్మిత అండర్–14 విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు యార్లగడ్డ బంగార్రాజు బుధవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీల్లో అస్మిత పాల్గొంటుందని ఆయన చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయిన విద్యార్థినిని అన్నవరం ట్రస్టు బోర్డు ప్రత్యేకాహ్వానితులు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోరంపూడి రమేష్, విద్యా కమిటీ చైర్మన్ కొరెడ్డి వీరబాబు, గ్రామ పెద్దలు అభినందించారు.

సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్రబాబు

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాయభూపాలపట్నం పీఏసీఎస్ అధ్యక్షులు నల్లల నాగేంద్రబాబు అన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో బుధవారం సొసైటీ కార్యదర్శి ఎన్‌వీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన పీఏసీఎస్ మహాజన సమావేశంలో నాగేంద్రబాబు మాట్లాడుతూ సొసైటీలో సుమారు కోటి రూపాయల వరకూ డిపాజిట్లు సేకరించామన్నారు. స్వల్ప కాలిక రుణాలి కింద సొసైటీ పరిధిలో 600 మంది రైతులకు రూ.5.60 కోట్ల రుణాలిచ్చామన్నారు. కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో సుమారు 45 లక్షల రూపాయలు ఎరువులను రైతులకు పంపిణీ చేశామన్నారు. అనంతరం పలు అంశాలను అజెండాలో ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు పుట్టా వెంకట్రావు, వీరభద్రరావు, పాము గోవిందు, గంగుమళ్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

కొడవలిలో ఉచిత పశువైద్య శిబిరం

పిఠాపురం: జిల్లా పశుసంవర్ధక శాఖ రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం గొల్లప్రోలు మండలం కొడవలిలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. దుర్గాడ పశు వైద్యాధికారి ప్రశాంత్ 3800 గొర్రెలకు, మేకలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసి, టీకాలు వేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రె నాగేశ్వరరావు, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు చంద్రంపాలెం విద్యార్థి


వెంకటదుర్గను అభినందించిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సామర్లకోట: రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు చంద్రపాలెం విద్యార్థి దేవిశెట్టి వెంకటదుర్గ ఎంపికైనట్టు ఆ పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు వీరబాబు బుధవారం రాత్రి విలేకర్లకు తెలిపారు. ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వెంకటదుర్గను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. హెచ్‌ఎం కె.భాస్కరకుమార్, గ్రామ పెద్దలు అభినందించారు.

బైబై గణేశా..!

- ఘనంగా గణపతి ఊరేగింపు
- పూజా కార్యక్రమంలో పాల్గొన్న దవులూరి దొరబాబు


సామర్లకోట లారీ స్టాండ్ వద్ద గణపతిపూజల్లో పాల్గొన్న దవులూరి దొరబాబు

సామర్లకోట: గణేశ్ నవరాత్రఉత్సవాలు ముగియడంతో బుధవారం గణపతి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. స్థానిక లారీ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద జరిగే పూజల్లో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. లారీ స్టాండ్ నుంచి భారీ ఎత్తున బాణా సంచా కాల్పుల మధ్య వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో గణేష్ నిమజ్జన ఊరేగింపు ఉత్సాహంగా జరిగింది. ఈ ఊరేగింపు లారీ స్టాండ్ నుంచి మెహర్‌కాంప్లెక్స్, మఠంసెంటర్, స్టేషన్ సెంటర్ మీదుగా గోదావరి కాలువ వరకూ సాగింది. అక్కడ గణేశ నిమజ్జనం చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పబ్బినీడీ దుర్గాప్రసాద్, కార్యదర్శి పెదిరెడ్ల కృష్ణ, ఇతర సభ్యులు సేవలందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్, చల్లపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక రైల్వే స్టేషన్‌లోని టాక్సీ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన ఊరేగింపు, పెద్దాపురం ఆటో యూనియన్ కార్యాలయం, 15వ వార్డు మట్టపల్లి వారి వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన ఊరేగింపులు భారీ ఎత్తు సాగాయి. ఆయా యూనియన్ నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

భక్తిశ్రద్ధలతో గణపతికి అభిషేకాలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో ఉన్న గణపతి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. గణపతి ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్ర ఉత్సవాలు ముగియడంతో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 108 ఉండ్రాళ్లు, 108 లీటర్లు ఆవుపాలు, చెరకు రసం, నదీ జలాలతో అభిషేకాలు చేశారు. నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా ప్రతి రోజు ఆలయంలో జరిగే హోమాలు బుధవారంతో ముగిశాయి. ఈఓ డి.నాగ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలను అర్చకులు సన్నిధిరాజు వెంకటరమణ, కొంతేటి జోగారావు శ్రీకాకుళపు వినయ్, చెరుకూరి సుందర రామయ్య, చెరుకూరి రాంబాబు నిర్వహించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్ నేతల హరిబాబు, ట్రస్టు బోర్డు సభ్యులు కర్రి వెంకటలక్ష్మి, బొందలపు కృష్ణవేణి, యండమూరి వెంకటసుబ్బారావు, భక్త సంఘం నాయకులు బొందలపు వెంకటరమణ, బిక్కిన సాయి తదితరులు పాల్గొన్నారు.

వీర్రాఘవపురంలో అన్నదానం

స్థానిక వీర్రాఘవపురం లేఅవుట్‌లో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో దవులూరి చారిటబుల్ ట్రస్టు అదినేత దవులూరి సుబ్బారావు, కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు పాల్గొని భక్తులకు సేవలందించారు. అనంతరం సాయంత్రం నిమజ్జన ఊరేగింపు ప్రారంభమైంది.

గణేష్ నిమజ్జనాల జోరు ప్రారంభం

స్థానిక గోదావరి కాలువలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు బుధవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో విగ్రహాలను నిమజ్జనాలు చేశారు. కాకినాడ, సర్పవరం, పెద్దాపురం, సామర్లకోట పట్టణ, మండల పరిధిలో హుస్సేన్‌పురం, వేట్లపాలెం, జి. మేడపాడు, పీబీ దేవం గ్రామాల్లో నిర్వాహకులు గోదావరి కాలువలో నిమజ్జనాలు చేశారు. ఆయా శిబిరాల నుంచి ఊరేగింపుగా స్థానిక పంచారామ క్షేత్రం ముఖద్వారం వద్ద స్నానాల రేవు వద్ద నిమజ్జనాలకు ఏర్పాట్లు చేశారు. సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సై పీవీఆర్ మూర్తి తన సిబ్బందితో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. మండల పరిధిలో ఆయా ప్రాంతాలోను పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు పారిశుధ్య లైటింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. వీఆర్వోలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బుధవారం 24 విగ్రహాల నిమజ్జనం జరిగిన్నట్టు వీఆర్వో నందూరి ప్రసాదరావు తెలిపారు.

గ్రామాల్లో అన్న సంతర్పణలు

పెద్దాపురం: మండలంలోని వడ్లమూరు, పట్టణంలోని పలు వినాయక మండపం వద్ద బుధవారం భారీ అన్నదాన సంతర్పణలను ఏర్పాటు చేశారు. ఈ అన్నసంతర్పణలను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు కంటే వీర్రాఘవరావు, ఆవాల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రాజీవ్‌కాలనీ గణేషుడు

గణేష్ నిమజ్జన వేడుకల్లో భాగంగా స్థానిక రాజీవ్ కాలనీలో ఏర్పాటు చేసిన ఆరడుగుల మట్టి వినాయుడు గణేష్ నిమజ్జన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ కాలనీ యువత మహేష్, తేజ ఆధ్వర్యంలో నోట్ల కట్టలతో అలంకరించిన గణేషుడు అందరినీ ఆకట్టుకున్నారు.


కొత్తపల్లి సాగర తీరంలో వినాయకుని నిమజ్జనం చేస్తున్న భక్తులు


సామర్లకోట గోదావరి కాలువలో క్రేన్‌తో గణేష్ విగ్రహం నిమజ్జనం

ఘనంగా వినాయక నిమజ్జనాలు

- భక్తజనంతో కళకళలాడిన సాగరతీరం
- పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు

పిఠాపురం: నియోజకవర్గం వినాయక నిమజ్జనాలతో హోరెత్తింది. పట్టణంతో పాటు మండలం, గొల్లప్రోలు నగర పంచాయతీ, గొల్లప్రోలు మండలాల్లో పలు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ఏలేరు, పీబీసీ కాలువల్లో నిమజ్జనాలు చేశారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 300లకు పైగా విగ్రహాలను నిమజ్జనాలకు తరలించారు. డీజే సౌండ్లు, మేళ తాళాలతో ఊరేగింపులు హోరెత్తాయి. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గొల్లప్రోలులో సహస్ర దీపాలంకరణ సేవ


గొల్లప్రోలు నగర పంచాయతీ మార్కెట్ సెంటర్లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. కరణంగారి తోట ప్రాంతంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో వినాయకుడికి సమర్పించిన 126 కేజీల లడ్డు వేలం పాట నిర్వహించారు. అలాగే పిఠాపురం మిరపకాయల వీధిలో సిద్ధి వినాయక యువసేన, వర్తక సంఘం ఆధ్వర్యంలో 30వ వార్షికోత్సవం సందర్భంగా 45 కేజీల లడ్డును వేలం పాట నిర్వహించగా కస్తూరి చినబాబు రూ.65,900కు పాడుకున్నారు.

కొత్తపల్లి సాగర తీరంలో సందడి

కొత్తపల్లి: గణపతి నవరాత్రులు ముగిసిన సందర్భంగా ఉప్పాడ, పొన్నాడ శివారు కొనపాపపేట సాగరతీరం గణనాథుని నిమజ్జనాలతో బుధవారం కళకళలాడింది. సుమారు 300లకు పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిమజ్జనాలు సాగాయి. మండలంలో కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కలవలదొడ్డి, శొంఠివారిపాకలు, మూలపేట, యండపల్లి, కోనపాపపేట తదితర గ్రామాల్లో ఉన్న వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా కాల్పులతో గ్రామాలలో ఊరేగించారు. ఉప్పాడ సముద్రంలో మండలం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కిర్లంపూడి తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది విగ్రహాలను లారీలు, ట్రాక్టర్లు, ఆటోలపై ఊరేగింపుగా భజనలు, నృత్యాలు, బాణసంచా కాల్పులతో తీసుకొచ్చి భక్తులు సాగరతీరంలో నిమజ్జనం చేశారు. తీరంలో గణనాథునికి ప్రత్యేక హారతులు ఇచ్చి పూజించారు. అనంతర, భక్తులకు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు, ఎస్సైలు స్వామినాయుడు, సత్యనారాయణ ఆధ్వర్యంలో తన సిబ్బందితో బందోబస్తును నిర్వహించారు. ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డులో నిమజ్జన వాహనాలకు తప్ప మిగిలిన వాహనాలకు అనుమతులు ఇవ్వలేదు.

భారీ అన్నసమారాధన

గణపతి నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక జైగణేశా ఆలయం వద్ద బుధవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెళ్లి విందు తలపించేలా పలు రకాల వంటకాలతో ఆలయ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప, ఉప్పాడ తదితర గ్రామాల నుంచి సుమారు 4 వేల మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.


గొల్లప్రోలులో సహస్ర దీపాలంకరణ సేవ


ఉప్పాడ తీరంలో భక్తులకు సూచనలిస్తున్న ఏఎస్పీ శ్రీనివాస్

నిమజ్జనాలకు సహకరించాలి : ఏఎస్పీ శ్రీనివాస్

గణపతి నిమజ్జనాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భక్తులు సహకరించాలని అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఉప్పాడ శివారు సుబ్బంపేట, పొన్నాడ శివారు కోనపాపపేట తీరప్రాంతంలో జరుగుతున్న నిమజ్జన ప్రదేశాలను బుధవారం ఆయన పరిశీలించారు. కాకినాడ రూరల్ సూర్యారావు పేట, కొత్తపల్లి మండలంలో 2, తొండంగి మండలాల్లో 2 తీర ప్రాంతాల్లో 2వేల విగ్రహాల వరకు నిమజ్జనాలు జరగనున్నాయని అన్నారు. గురువారం కూడా నిమజ్జనాలు జరగనున్నాయని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన తెలిపారు.

ప్రజల్లోకి పోస్టల్ సేవలు


ఉండూరు సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోస్టల్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తున్నట్టు సామర్లకోట అసిస్టెంట్ సూపరింటెండెంట్ దాసి అనిల్ అంబేడ్కర్ అన్నారు. జనంలోకి మనం అనే కార్యక్రమాన్ని బుధవారం ఉండూరు గ్రామంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు ఆవశ్యకత, తపాలా శాఖలో వివిధ పథకాలను వివరించారు. గ్రామంలో పోస్టాఫీసు ద్వారా ఆధార్, గ్రామీణ తపాలా జీవిత బీమా, సుకన్య సమృద్ధి ఖాతాలను అందిస్తున్నట్టు ఆయన వివరించారు. పోస్టల్ బ్రాంచి మేనేజరు కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ పోస్టాఫీసులో వివిధ ఖాతాలు, ప్రజల వద్దకు బ్యాంకింగ్ సేవలు, పోస్టుమెన్ ద్వారా అందుబాటులోనికి భారత ప్రభుత్వం తపాలా శాఖ తీసుకు వచ్చిందన్నారు. ఖాతాదారులు అతి తక్కువ ప్రీమియం ఏడాదికి రూ.400 చెల్లించడం ద్వారా ప్రమాద బీమా కట్టుకున్న వారు మరణిస్తే రూ.10లక్షలు ప్రమాద బీమా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలకు ఆధార్‌కార్డు, మొబైల్ నంబరు లింక్, ఎన్‌పీసీఐ ఖాతాలు సులువుగా తెరిచే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యాది ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తోట సత్యనారాయణ, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకలను సామూహికంగా నిర్మూలించాలి


రైతులకు ఎలుకల నిర్మూలన మందు అందజేసిన ఎంపీపీ సత్తిబాబు

పిఠాపురం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలకు తెగుళ్లు సోకకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ఎలుకల వల్ల పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు వహించాలని ఎంఏఓ ఎ.అచ్యుతరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. పిఠాపురం మండలంలో పలు గ్రామాల్లో బుధవారం ఆయన ఆర్బీకే సిబ్బందితో కలసి ఎలుకల సామూహిక నివారణ నిర్వహించారు. ఎలుకల నివారణకు ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఉచితంగా మందు పంపిణీ చేస్తోందన్నారు. బ్రోమోడయోలిన్ 2 శాతం విషపు ఎరను నూకలు 96 పాళ్లు, నూనె 2 పాళ్లను కలిపి ఆ మిశ్రమాన్ని 10 గ్రాముల పొట్లాలుగా చేసి పంట పొలాల్లో ఎలుకల బొరియల వద్ద ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండలానికి 90 కేజీల బ్రోమడయోలిన్ మందును సిద్ధం చేసి రైతులకు అందజేస్తున్నామని అచ్యుతరావు తెలిపారు.

ఎలుకల వలన దిగుబడికి దెబ్బ

కొత్తపల్లి: మండలంలోని కొత్తపల్లి, గోర్స్‌లో బుధవారం సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టారు. ఎంఏఓ జోగిరాజు ఆధ్వర్యంలో ఎలకల మందు తయారీపై అవగాహన కల్పించారు. గ్రామంలోని అన్ని సచివాలయాల్లో ఎలుకల మందు అందుబాటులో ఉంటుందన్నారు.

సామర్లకోట: మండల వ్యవసాయం శాఖ ఆధ్వర్యంలో బుధవారం వేట్లపాలెంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు పాల్గొని మాట్లాడుతూ రైతులు పండిస్తున్న పంట పొలాల్లోను, నిల్వ చేస్తున్న ఆహార ధాన్యాలకు ఎలుకల బెడద ఎక్కువగా ఉంటుందని, దానికి సామూహిక ఎలుకల నివారణ ఒక్కటే మార్గమన్నారు. మండల వ్యవసాయాధికారి ఐ సత్య మాట్లాడుతూ ఎలుకలు నిర్మూలనకు వాడే రసాయనాలలో బ్రోమోడమోలిన్ మందు, నూకలు, నూనెలతో కలిపి ఎలుకల కన్నాల వద్ద 10 గ్రాములు చొప్పున పొట్లాలుగా పెట్టాలన్నారు. దీని కారణంగా ఎలుకలకు దాహం వేసి నీటి కొరకు బయటకు వెళ్లి చనిపోతాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి రైతు ఎలుక నిర్మూలన మందును ఉపయోగించాలన్నారు. ఈ మేరక ఎలుకల మందు కలిపే పద్ధతిని రైతులకు వివరించి రైతులకు ఎలుకల మందును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ ఎంవీ సతీష్, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులు


రామ్‌నాథ్‌కి స్కానర్ అందజేసిన మేనేజరు కృష్ణమోహన్

సామర్లకోట: పంచాయతీల్లో నగదు రహిత చెల్లింపులు లేకుండా స్థానిక యూనియన్ బ్యాంకు అధికారులు అడుగులు వేస్తున్నారు. దీనిలో భాగంగా ప్రతి పంచాయతీ కార్డు స్కానింగ్ మెషీన్లు, స్కానర్లను అందజేశారు. మూడు వేల జనాభా లోపు ఉన్న వారికి స్కానర్లు, మూడు వేలు జనాభా మించితే స్కానింగ్ మెషీన్‌ను అందజేశారు. పీబీ దేవం, హుస్సేన్ పురం పంచాయతీలకు యూనియన్ బ్యాంకు మేనేజరు కృష్ణమోహన్ బుధవారం వాటిని అందజేశారు. ప్రజలు నగదు చెల్లించాల్సిన పని లేదని స్కానింగ్ ద్వారా వారికి తగిన రసీదులను అందజేస్తామని పీబీ దేవం పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్ తెలిపారు.

భారీ వర్షం

సామర్లకోట: కుంభ వృష్టిగా బుధవారం రాత్రి ఏడు గంటల నుంచి వర్షం కురవడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దాంతో వివిధ ప్రాంతాల నుంచి సామర్లకోట గోదావరి కాలువ రేవు వద్దకు వచ్చిన విగ్రహాల నిమజ్జన నిర్వాహకులు ఇబ్బందులకు గురయ్యారు. నిమజ్జన ప్రదేశం వద్ద జనరేటర్ ఏర్పాటు చేసి నిమజ్జనాలకు అంతరాయం లేకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురిసిన ప్రధాన రోడ్లతో పాటు పల్లపు ప్రాంతాలు వర్షపు నీటితో మునిగిపోయాయి.

ఆక్రమణలపై దృష్టి పెట్టండి

- అధికారులను ఆదేశించిన కౌన్సిల్
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ సమావేశం


సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్. (అంతర చిత్రం) మాట్లాడుతున్న చైర్‌పర్సన్ తులసీ మంగ తాయారు

పెద్దాపురం: పట్టణంలో మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ఆరెళ్లి వీర్రాఘవులు, ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ పట్ట ణంలో అనేక చోట్ల మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. లెప్రసీ కాలనీలో మున్సిపల్ స్థలంలో అక్రమ కట్టడాలు నిర్మించినా చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయంలో ఉద్యోగులపై పర్యవేక్షణ లోపించిందని, వారి పనితీరుపై దృష్టి సారించాలని సూచించారు. రాజశేఖర్ మాట్లాడుతూ మెయిన్‌రోడ్డులో ఆంజనేయ స్వామి గుడి వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో మరింత చొరవ చూపాలన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్య భాస్కర్ మాట్లాడుతూ 9, 10 వార్డుల్లో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదన్నారు. స్థానిక ఎస్‌కేవీఎం కళాశాల వద్ద కల్వర్టు ఇబ్బందులు తొలగించాలన్నారు. మున్సిపల్, చైర్‌పర్సన్ మంగతాయారు, వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో ఆక్రమణలో ఉన్న మున్సిపల్ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ కల్పించాలన్నారు. అనంతరం పలు అంశాలపై వాడీవేడి చర్చ సాగింది. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, కమిషనర్ సురుంద్ర, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈఈ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, ఆర్ఓ చంద్రశేఖరం, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, వాసంశెట్టి గంగ, తలారి శ్యామలత, మున్సిపల్ మాజీ చైర్మన్ ముప్పన శ్యామలాంబ, కౌన్సిలర్లు సయ్యద్ అమీనాబీబీ, పేరింశెట్టి అంబికతో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీనాయుడికి సత్కారం


గౌరీనాయుడిని సత్కరిస్తున్న సదస్సు నిర్వాహకులు

పిఠాపురం: పట్టణానికి చెందిన యువ రచయిత డాక్టర్ కిలారి గౌరీనాయుడు విశాఖపట్నంలో హిందీ సాహిత్య భారతి సౌజన్యంతో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించిన అంతర్జాతీయ బహు భాషా సదస్సులో సత్కారం అందుకున్నారు. ఈ సదస్సులో ఆయన భారతీయ సాహిత్య ఆధ్యాత్మికత అనే అంశంపై పేపర్ ప్రెజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా ముగింపు సదస్సులో ఉన్నత విద్యా ఆర్జేడీ ఎస్.శోభారాణి కళాశాల ప్రిన్సిపల్ షైజీ, సదస్సు కన్వీనర్ పీకే జయలక్ష్మి, ఆచార్య వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి, ఉత్తర ప్రదేశ్ పూర్వ విద్యా శాఖా మంత్రి రవీంద్ర శుక్లా, కొరియన్ బాషా పరిశోధకుడు కిమ్‌లు గౌరీనాయుడిని సత్కరించారు.

పాఠశాలలో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు

సామర్లకోట: విద్యార్థి దశ నుంచి వినియోగదారుల్లో చైతన్యం తీసుకువచ్చేలా ప్రభుత్వం పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేయడం మంచి పరిణామమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 9 రకాల అంశాలపై చైతన్యం కలిగించే పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థులకు తూనికలోను మోసాలు, కల్తీలను కనిపెట్టడం, వినియోగదారుల హక్కుల రక్షణ తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచరు జి గోవిందు, వ్యాయమ ఉపాధ్యాయుడు తాళ్లూరి వైకుంఠం, సైన్సు టీచరు ఎఎల్‌వీ కుమారి, క్లబ్ ప్రెసిడెంట్ ఆర్ శివరామకృష్ణ, కార్యదర్శి బి హరిక సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు మేలు జరిగేలా కులగణన సర్వే

సామర్లకోట: బీసీలకు మేలు జరిగే విధంగా కుల గణన సర్వే ఉంటుందని అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరీ అన్నారు. బుధవారం సాయంత్రం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కులగణన సర్వే చేయాలని సాహసమైన నిర్ణయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేశారన్నారు. దీని కారణంగా బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి కచ్చితమైన కుల గణన ఉంటుందన్నారు. దీని కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తూ ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశంలోనే మొదటిసారిగా పూర్తి స్థాయిలో బీసీ కుల గణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి చర్చించడం బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, తీర్మానం ప్రవేశపెట్టిన మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బీసీల తరుపున ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఇద్దరికి జైలు

కాకినాడ లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన ఇద్దరికి మూడు నెలల చొప్పున జైలు, ఒక్కొక్కరికి రూ.50 వేల పరిహారం విధిస్తూ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడకు చెందిన కె.సుబ్బారెడ్డి నుంచి కాకినాడ చెందిన కేఎస్ఎస్ ప్రకాష్, ప్రత్తిపాడు చెందిన కె.అరుణశ్రీ 2019లో రూ.2 లక్షల అప్పుతీసుకున్నారు. బాకీ తీర్చేందుకు 2020లో రూ.50వేలు విలువ గల రెండు చెక్కులు ఇచ్చారు. చెక్కును సుబ్బారెడ్డి బ్యాంక్‌లో వేయగా బౌన్స్ కావడంతో కోర్టును ఆశ్రయించారు. కోర్టు విచారణలో ప్రకాష్, అరుణశ్రీపై నేరం రుజువు కావడంతో పై విధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

తీరానికి కొట్టుకువచ్చిన మృత డాల్ఫిన్


మృతి చెందిన డాల్ఫిన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శివారు ఎస్పీజీఎల్ విద్యుత్ కర్మాగారం సమీపంలోని తీర ప్రాంతానికి బుధవారం మృతి చెందిన డాల్ఫిన్ కొట్టుకొచ్చింది. మత్స్యకారుల సమాచారంతో అధికారులు డాల్ఫిన్‌ను పరిశీలించారు. కాకినాడ అటవీశాఖ రేంజర్, జంతు సంరక్షణ అధికారి వరప్రసాద్ పర్యవేక్షణలో డాల్ఫిన్‌కు పంచనామా చేశారు. గురువారం వివిధ శాఖల పర్యక్షణలో పశు సంవర్ధక అధికారి పోస్టుమార్టం చేయనున్నారు. సుమారు రెండేళ్ల వయసు, 5.5 అడుగుల పొడవు , 45 కిలోల బరువు ఉండవచ్చన్నారు. ఎస్సై స్వామినాయుడు, మత్స్యశాఖ అధికారి శ్రీరామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది డాల్ఫిన్ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తపల్లి: మండలంలోని ఎండపల్లి–నాగులాపల్లి రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన కథనం మేరకు తూర్పుగోదావరి జిల్లా కొంతమూరు గ్రామానికి ఖాదర్ నాగూరు (50) మోటారు సైకిల్‌పై రాతి పనుముట్ల విక్రయానికి నాగులాపల్లి వెళుతుండగా నాగులాపల్లి నుంచి ఎండపల్లి వెళ్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నాగూరుకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. ఎస్సై స్వామినాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.